నిధులు పైసా కూడా విడుదల చేయకుండా అభివృద్ధి ఎలా సాధ్యం...

సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఇద్దరు విద్యార్థినులు మరణం, సుమారు రెండు వందల మంది విద్యార్థులు ఏకకాలంలో హెపటైటిస్-ఎ బారిన పడి ఆసుపత్రిలలో మృత్యువుతో పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా నిదులు కూడా మౌలిక సదుపాయాలు కల్పనకు విడుదల చేయకపోవడంపై సిపిఐ మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు మండిపడ్డారు. సోమవారం స్థానిక ఏకలవ్య పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలను సిపిఐ నాయకులుతో కలిసి పరిశీలించారు. ఏకకాలంలో వ్యాప్తికి గలకారణాలు ఇన్చార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని అడిగి తెలుసు కున్నారు. మరగుదొడ్లు, తాగునీటి బోర్లు, వంటశాలలను పరిశీలించారు. అనంతరం నాబార్డు భవనంలో నిర్మాణం చేపడుతున్న గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ డిఈఈ చాణుక్య తో మాట్లాడుతూ మౌలిక వసతులు అభివృద్ధికి తీసుకున్న చర్యలను ప్రశ్నించారు. ప్రస్తుతం మరగుదొడ్లు, వాటర్ ట్యాంక్, తాత్కాలిక వంటగది సిద్ధం చేసామని మిగిలిన మౌలిక సదుపాయాలు ను కల్పించేందుకు కోటి అరవై ఐదు లక్షల రూపాయలతో ప్రతి పాదనలు పంపామని తెలిపారు. అలాగే అసంపూర్తిగా మిగిలిన నాబార్డు అధనపు తరగతి గదులు, ఇంటర్మీడియట్ భవనాలు పరిశీలించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథ రావు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన సదుపాయాలు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ప్రకటన కే పరిమితము కావడం గిరిజన విద్యార్థులు పట్ల ఎంత అభిమానం ఉందో అర్థమవుతుందని అన్నారు. మరణాలు పునరావృతం కాకుండా మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని ,పాఠశాల వాతావరణం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.సిపిఐ నాయకులు ప్రసాద్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యపాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం 30కి హెపటైటిస్ : ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ యుగంధర్ నిర్లక్ష్యం కారణంగా 30మంది విద్యార్థులు హెపటైటిస్ ఎ సోకటానికి కారణం అని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథ రావు విమర్శించారు. ప్రక్క పాఠశాలలో ఇద్దరు, మరణం, 130మందికి ఏకకాలంలో వస్తే వైద్య పరీక్షలు చేయించాల్సిన ప్రిన్సిపాల్ స్పందించకుండా వదిలి వేయటం, జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో వైద్య పరీక్షలు నిర్వహించి ఆసుపత్రికి తరలించారని, ప్రిన్సిపాల్ ముందుగా స్పందించితే ఈ అనర్థాలు జరిగేవి కాదని అన్నారు.

గిరిజన విద్యార్థులు మరణించినా ప్రభుత్వానికి కనిపించదా..?

- విద్యారంగ సమస్యల పరిష్కారానికై అక్టోబర్ 22 నుండి ఇచ్ఛాపురం-హిందూపురం బస్సు జాతాను జయప్రదం చేయండి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు

విశాలాంధ్ర-బెలగాం : ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగు బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పార్వతీపురం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సు జాత కరపత్రాలు విడుదల చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల వలరాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి బస్సు జాత కొనసాగుతుందని తెలపారు. ప్రధానంగా ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన విద్యార్థుల బ్రతుకులు 20 సంవత్సరాల వెనుకకు వెళ్ళిందని కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మరణించి, 200లకు పైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైతే ఏ ఒక్క అధికారి గాని స్థానిక ప్రజా ప్రతినిధులు గాని స్పందించకపోవడం అత్యంత హేయమైన చర్యని పేర్కొన్నారు. ఇంత బాధాకరమైన సంఘటన చోటు చేసుకున్న, విద్యార్థులు ఇంటికెళ్లిన వెంటనే మరణించారు. మాకేం సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్న గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంత్రి హోదాలో ఉండి ఇద్దరు విద్యార్థినులు చనిపోతే మాకేం సంబంధం లేదనడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా పిపిపి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్న కూటమి ప్రభుత్వ ఆలోచనలను విరమించుకోవాలని ప్రభుత్వ వైద్య విద్యను పేదలకి అందజేయాలనే ఆలోచన ఉంటే నారాయణ, గీతం, విట్ కళాశాలలో పిపిపి విధానం అమలు చేయాలని సవాల్ విసిరారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందక ఉద్యోగ ఉపాధి లేక ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తిస్థాయిలో విడుదల కాక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని యువగళం పాదయాత్రలో నేను అధికారంలోకి వస్తే బకాయిలన్నీ పూర్తిస్థాయిలో విడుదల చేస్తానని చెప్పిన ఆయన అధికారంలోకి వచ్చాక తానే స్వయాన విద్యాశాఖ మంత్రి అయినా విద్యారంగ సమస్యలు గాలికి వదిలేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవి కుమార్ మాట్లాడుతూ బిసి, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని సొంత భవనాలు లేక పాము కాట్లతో, విష జ్వరాలతో మరణిస్తున్నారని కురుపాం గురుకుల పాఠశాలలో చనిపోయిన విద్యార్థులకు గిరిజన శాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీన రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై జరుగుతున్న బస్సు పార్వతీపురం చేరుకుంటుందని విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సిబిఐ ఎంక్వైరీ చేపట్టాలి

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి ప్రజలు చనిపోతున్నారని నకిలీ మద్యంపై ప్రభుత్వం తక్షణమే సిబిఐ ఎంక్వైరీ చేసి దోసులను కఠినంగా శిక్షించి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానిక మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా పరిధిలో 400 పైచిలుకు బెల్ట్ షాపులు అనధికారకంగా నిర్వహిస్తున్నారని తక్షణం వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును నీరు గార్చేందుకే సిట్ ఏర్పాటు చేశారని తప్పుచేసిన వాళ్లే సిట్ వేస్తే ఎలా వాస్తవాలు బయటపడతాయన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే సీబీఐ దర్యాప్తు కోరాలన్నారు. సిటొ అనేది చంద్రబాబు జేబులో ఉండే టీమ్ అన్నారు. ఇప్పుడు ఈ నకిలీ మద్యం దందా ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో, ప్రజల ముందు దోషిగా నిలబడిన సీఎం చంద్రబాబు, కేసు డైవర్షన్ కోసం ఈ సిట్ డ్రామాకు తెర లేపారన్నారు. చంద్రబాబు ఆటలు ఎంతోకాలం సాగవన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పోలా సత్యనారాయణ, జిల్లా ఇంటలెక్చువల్ ఫారం అధ్యక్షులు పోరాన శ్రీరామచంద్ర నాయుడు, ఎంపీపీలు గుడివాడ నాగమణి, మజ్జి శోభారాణి, జడ్పిటిసిలు మామిడి బాబ్జి, అలసింగి రవికుమార్, బలగ నాగేశ్వరరావు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లిక్కర్ మాఫియాను అరికట్టాలి

విశాలాంధ్ర-సాలూరు : పట్టణంలో ఎక్సైజ్ సిఐ కార్యాలయం వద్ద వైకాపా శ్రేణులు కల్తీమద్యం నిరోధించాలని నినదిస్తూ సిఐ దాస్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం నియత్రించి లిక్కర్ మాఫియాను అరికట్టాలన్నారు.రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు వెలిశాయన్నారు. అంతేకాకుండా నకిలీ మద్యం ఏరులై పారడంతో పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు రెడ్డి పద్మావతి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజలకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించి రాష్ట్రంలో దాదాపు మూడో వంతు మద్యం షాపులను తగ్గించారన్నారు.నేడు మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి విచ్చలవిడి అమ్మకాలు జరుపుతున్నారన్నారు. నకిలీ మద్యంతో రాష్ట్రంలో 421 మంది మరణించినట్లు పత్రికలలో ప్రచురించారన్నారు. పేదల జీవితాలలో విషాదాన్ని నింపిన కల్తీమద్యం తయారు దారుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరిరఘు, వైకాపా సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, తోణాం సర్పంచ్ ముప్పల ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని కుథమ పంచాయతీ పరిధిలో పెద కుదమ చిన కుదమ గ్రామాల మధ్య గౌరి పురం కూడలి వద్ద సోమవారం ఉదయం ట్రాక్టర్ ఢీ కొనడంతో పెద కుదమ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణ (46) మృతి చెందారు. దీనిపై చిన మేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి అనిష్ తెలిపిన వివరాల ప్రకారం పె ద కు ద మ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణం వేకువ జామున చిన కుదమ వెళ్లి తిరిగి వస్తుండగా పెద కుదమ చిన కుదమ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతనిని ఢీకొంది దీనిని చూసిన ప్రత్యక్ష సాక్షులు వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు వెంటనే వచ్చిన 108 వాహనంపై అతనిని పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిక తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు ఇతనికి భార్య గంగ కుమారుడు కుమార్తె సునీత ఉన్నారు కుమారుడు కుమార్తె లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిష్ తెలిపారు. కాగా కుమార్తె సునీతకు పెళ్లి నిశ్చయమై ఆదివారం (నిన్ననే) పెళ్లి ప్రారంభానికి ముందు జరుపుకునే గోధుమ రాయి కార్యక్రమం జరిగిందని గ్రామస్తులు తెలుపుతూ ఇంతలో ఈ విధంగా జరగడం కుటుంబ సభ్యులు, అటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-బెలగాం : మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని, గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు విద్యార్థి, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు, పలు పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు..ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ప్రాణాలకు ఎటువంటి విలువ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు..ఇటీవల కాలంలో మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు అంజలి, కల్పన తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అంజలి తల్లికి ఉద్యోగం ఇవ్వాలని, గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సురక్షితమైన తాగునీరు, పౌష్టికాహారం అందించాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్ఎం లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), ఆర్వీఎస్ కుమార్ (సిపిఐ పార్టీ), బి. రవికుమార్ (ఎఐఎస్ఎఫ్), కె. సోమేష్(పిడిఎస్ఓ), పి. సంగం (సిపిఐ ఎంఎల్ - లిబరేషన్ పార్టీ), వి. దాలినాయుడు (కాంగ్రెస్ పార్టీ), టి. జీవా (రెడ్ స్టార్ పార్టీ), నాయకులు గణేష్, గౌరీ శంకర్రావు, సూరయ్య, గౌరీ, రంజని, రజినీ, గౌరమ్మ, రామయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి ఫోన్ అందజేసిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలకు కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి అర్జీదారుల సమక్షంలోనే కొన్ని సమస్యలనుపరిష్కరిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సీతానగరం మండలం చినభోగిలికి చెందిన చుక్కగణేష్ దివ్యాంగుడైన తనకు టచ్ ఫోన్ మంజూరు చేయాలని కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందిస్తూ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రతినిధిని ఆదేశిస్తూ టచ్ ఫోన్ అర్జీదారునికి కలెక్టర్ పంపిణీ చేశారు. అర్జీఇచ్చిన వెంటనే తన సమస్య తీరడం పట్ల అర్జీదారుడు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు పర్యాటక బోట్లు నిలుపుదల

విశాలాంధ్ర-దేవీపట్నం : గోదావరి, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విపరీతంగా వర్షాలు కురుస్తున్న కారణగా గోదావరి బోటు విహారానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. మరో మూడు రోజులు బోటు లను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పర్యాటక బోటు లు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. ఏటా ఇదే తంతు. అనుమతులు ఇవ్వడం ఆపుచేయడం పరిపాటిగా మారి పోయింది. దీన్నే నమ్ముకొన్న బోటు నిర్వాహకులకు ప్రభుత్వం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకొంటుందో తెలియక బోటు లు మనుగడ కచ్చులూరు బోటు ప్రమాదం తర్వాత నిబంధనలు ప్రభుత్వం కఠినతరం చేసింది.. నిజానికి ఎన్నో కుటుంబాలు పర్యాటక బోటుల ఆధారపడి బతుకు తున్నాయి. జల వనరుల తీసుకొనే నిర్ణయాలతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గోదావరి ఎక్కువగా ఉన్న సమయంలో విశాలాంధ్ర ముందే చెప్పింది కరక్ట్‌గా సెప్టెంబర్ 21నా నాలుగు సంవత్సరాల క్రితం గోదావరి ఫుల్‌గా ఉన్న సమయంలో నదికి ఎదురోడ్డీ పర్యాటక బోటు బోటు ఒకటి వార్త వచ్చిన రోజునే కచ్చులూరు ప్రమాదం జరిగి 54మంది గోదావరిలో సజీవ సమాధి అయ్యారు. గోదావరి లో పర్యాటకానికి అప్పటినుండి నిబంధనలు కఠినతరం చేసింది ప్రభుత్వం. గోదావరి నదీ పై ఆనకట్ట కడితే పాపికొండల ప్రకృతి అందాలు చూడలేము అనే పర్యాటకులు ఎక్కడెక్కడ నుంచో వస్తూ ఉంటారు. ఇక్కడ పరిస్థితులు వారికి తెలియదు పాపం. ఏదో సెలవు వచ్చింది ఎక్కడికన్నా వెళ్లి గడిపి వద్దాం అనుకుంటారే తప్ప. ఇవేమి తెలియవు. బోటు పాయింట్ వద్ద మైక్ లతో జాగృతి పర్చాలని ప్రభుత్వానికి ఉండాలి అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయి.

ఏ.దారకొండ మాజీ సర్పంచ్ గుండెపోటుతో హఠాన్మరణం

విశాలాంధ్ర-సీలేరు : జీ కే వీ ది, మండలం అమ్మవారి దారకొండ పంచాయతీ మాజీ సర్పంచ్ పంగి నీలకంఠం గుండెపోటుతో తన స్వగ్రామం తడకపల్లిలో మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. నీలకంతం సీనియర్ టిడిపి నాయకుడు. సోమవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. నీలకంతం హఠాన్మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి...!

- ఎన్ బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయాలి..!
- ఎక్సైజ్ స్టేషన్లో ధర్నా చేపట్టినా వైసీపీ శ్రేణులు..!

విశాలాంధ్ర-పాడేరు : నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాడేరు శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపు మేరకు జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు అధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి సిఐ టివివిఎస్ఎన్ ఆచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయంలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని వైద్యం, విద్య, విప్లవం తీసుకొస్తే.ఈ కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు లోకేష్ తండ్రి కొడుకులు మాత్రం వైద్య, విద్య నీ మాత్రం సర్వనాయసనం చేస్తున్నారు.ప్రజల ప్రాణాలు తీయటమే లక్ష్యంగా పెట్టుకొని అక్రమ డబ్బు సంపాదించడం కోసం ఎక్కడ బడితే అక్కడ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి బెల్టు షాపులు ఏర్పాట్లు చేసి నకిలీ మద్యం తయారు చేసి ప్రజలు ప్రాణాలకు బలి తీసుకుంటున్నారన్నారు. ఏదైతే కల్తి మద్యం తయారు చేస్తున్నారో సిబిఐ ఎంక్వైరీ చేసి కల్తీ మద్యం బెల్టు షాపులు తక్షణమే తొలగించాలని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జీ.కే వీధి జడ్పీటీసీ కిముడు శివరత్నం, మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, నురుమని మత్స్యకొండ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీధరి మంగ్గన్న దొరా,నియోజక మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, వైసీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు,సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-దేవీపట్నం : గోకవరం ఆర్ & ఆర్ కాలనీ వద్ద వ్యక్తి అనుమాస్పద మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన రెడ్డిచర్ల నరసింహ రాజుగా పోలీసులు గుర్తి పట్టారు ఆర్ & ఆర్ కాలనీ ముఖ ద్వారం వద్ద జరిగిన ఈ దుర్ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామకంతం భూములు, ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లి గ్రామంలోని గ్రామ కంతం భూములు ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలంటూ రేఖపల్లి ఆదివాసి నాయక పోడు సేవా సంఘం, పీసా కమిటీ, సభ్యులు చిక్కాల బాలకృష్ణ, సార పాండురాజు, వేటకాని సూరిబాబు, గ్రామస్తులు ఆధ్వర్యంలో సోమవారం మండల స్థానిక ఎమ్మార్వోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి, గ్రామకంతం భూముల్లో కట్టినటువంటి అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని రేకపల్లి శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రక్కల, వెనక భాగంలో ఉన్నటువంటి మహా వృక్షాలను జెసిబి మిషన్ తో తొలగించి భూమిని చదును చేసి గ్రామకంత భూమినీ ప్రభుత్వ భూములను ఈ మధ్యకాలంలో కొంతమంది గిరిజనేతరులు ఆక్రమించుకొని ఇంటి స్థలాలుగా విభజించి ఒక్కొక్క స్థలం లక్ష రూపాయలుకు అమ్ముకుంటూ ఆక్రమలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై ఎల్‌టిఆర్ కేసులు నమోదుచేసి గ్రామ కంతం భూములు ప్రభుత్వ భూములు కాపాడాలని కోరారు. రేఖ పల్లిగ్రామంలో గ్రామ కంతం భూములు ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే చేసి ఇంటి స్థలాలు లేని నిరుపేద గిరిజనులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బేతి సారాయ్య, వెటకాని రాముడు, మాజీ సర్పంచ్ బేతి నాగేశ్వరావు, కొట్టి ముత్యాల రావు, వీర్ల శ్రీనివాసరావు, బేతి రాజు, బేతి నరసింహారావు, గంగుల నాగేశ్వరావు, వెటకాని బాలు,నూతి దినేష్, బేతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీతో మండలంలో 40 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్ ద్వారా 40 మంది ఉపాధ్యాయులు మండలానికి నూతనంగా ఎంపికై బాధ్యతలు చేపట్టారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి కృషిచేయాలని ఆయన సూచించారు. పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, మండల కార్యదర్శి శ్రీనివాస్ ఉపాధ్యాయులను అభినందించారు.

జెన్‌కో ట్రాన్స్‌కో ఒప్పంద కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఏపీ జెన్కో ట్రాన్స్కో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు న్యాయమైన కోరికలు తీర్చాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా తక్కువ జీతాలతో ఏపీ జెన్కో ట్రాన్స్కోలో నిరంతరం సేవలందిస్తున్న ఒప్పంద కార్మికులు న్యాయమైన కోరికలను తక్షణమే తీర్చి వారి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వా అధికారులను కోరారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఒప్పంద కార్మికుల భవిష్యత్తులు మాత్రం మారడం లేదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయనన్నారు.

దారకొండలో భారీ వర్షం

రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దారకొండలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. గ్రామానికి ఎత్తులో ఉన్న హైస్కూల్ వద్ద ఉన్న బ్రిడ్జికి దిగువ ప్రాంతానికి నీరు పోయే రంధ్రం లేకపోవడంతో అలాగే ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బ్రిడ్జికి ఆనుకొని ఉన్న చెరువును బాగు చేసినప్పటికి అందులో మట్టీ కూరుకుపోవడంతో చేరులో నీరంతా బ్రిడ్జి ద్వారా దిగువ ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకపోవడంతో రహదారిపై ప్రవహించి ఇండ్ల లోపలికి దిగువ వరి పంట చేలోకి వెళుతుంది. రహదారికి ఇరువైపులా సైడ్ కాలువలు లేకపోవడం కూడా దీనికి ప్రధాన కారణం. దీంతో సీలేరు వెళ్లే ప్రధాన రహదారి దారకొండ రామాలయం నుండి కోటకు గురైంది. పంటపొలాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పంట మొత్తం నీటమునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు ఇండ్లలోమి కూడా ప్రవహిస్తుంది. దీంతో ఇండ్లు కూలి పోయే ప్రమాదం ఉందని ఇండ్ల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైసీపీ భారీ ర్యాలీ

విశాలాంధ్ర-అరకులోయ : రాష్ట్రంలో హెచ్చుమీరుతున్న కల్తీ మద్యం తయారీ, సరఫరాకు వ్యతిరేకంగా వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు అరకులోయలో సోమవారం వైసిపి శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టాయి.స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభమైన కల్తీ మద్యం వ్యతిరేక ర్యాలీ అరకులోయ పట్టణం మీదుగా పద్మాపురం జంక్షన్ సమీపంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ వైసీపీ శ్రేణులు కల్తీ మద్యం తయారీ, సరఫరాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అరకులోయ పట్టణాన్ని హోరెత్తించారు. అరకులోయ ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసీపీ శ్రేణులు ప్రభుత్వ వైఖరిని తూర్పారపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా ఎక్కడికి అక్కడ కల్తీ మద్యం తయారీ కావడమే కాకుండా ఆ మద్యం బారులకు, మద్యం దుకాణాలకు,బెల్టు షాపులకు సరఫరా అవుతూ మందుబాబుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కల్తీ మద్యం మాఫియా రాజ్యమేలుతుందని ఆయన అన్నారు.చిత్తూరు జిల్లాలో ప్రత్యేకంగా ఈ కల్తీ మద్యం మాఫియా గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేసినప్పటికీ ఇంకా అనేక జిల్లాల్లో చాప కింద నీరుల కల్తీ మద్యం తయారీ అవుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం చోద్యం చూస్తుండడం వలనే కల్తిమద్య మాఫియా రెచ్చిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి కల్తీ మద్యం మాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే, సరఫరాను నియంత్రించకపోతే మందుబాబులు అనారోగ్యంతో ఆసుపత్రిలకు పరిమితం కావలసి వస్తుందని కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోయి కుటుంబాలను వీధిన పాలు చేయవలసి పరిస్థితులు తలెత్తుతాయని ఆయన విచారం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణమే స్పందించి మద్యం మాఫియా ఎక్కడెక్కడ, ఏఏ ప్రాంతాలలో విచ్చలవిడిగా తయారి అవుతుందో,సరఫరా జరుగుతుందో గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టి కల్తిమద్యం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అరకులోయ,అనంతగిరి, డుంబ్రిగూడ జెడ్పిటిసిలు శెట్టి రోషిని,సూర్యనారాయణ,చటారి జానకమ్మ, ఎంపీపీలు బాగా ఈశ్వరి,శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, పాంగి పరశురాం, విశాఖ ఉమ్మడి జిల్లా వైసీపీ ఎస్టీ సెల్ మాజీ కార్యదర్శి కమిడి అశోక్, సోషల్ మీడియా ప్రతినిధి పాంగి నరసింహారావు,వైసిపి నాయకులు పల్టాసింగి విజయ్ కుమార్, రామన్న, జన్ని అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

గుండెనొప్పికి సీపీఆర్ చేయడంపై అవగాహన

విశాలాంధ్ర-కూనవరం : గుండె నొప్పి వచ్చినప్పుడు వెంటనే సీ.పీ.ఆర్ చేయడంవల్ల మనిషి ప్రాణాన్ని కాపాడవచ్చని కోతులగుట్ట సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డా. కె. మహేష్ బాబు తెలిపారు.సోమవారం ఆసుపత్రి లో గుండె నొప్పితో పడిపోయిన వ్యక్తి కి సీపీఆర్ ఎలా చెయ్యాలి అనే విషయం మై సిబ్బంది కి ప్రజలకు ఆయన అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా గుండె నొప్పి వచ్చిన వ్యక్తి స్పృహ కోల్పోయిన సందర్భంలో అతనికి సీపీ ఆర్ చేయడం మూలంగా గుండె కొట్టుకునే స్థితికి తీసుకు వచ్చి వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని ఈ విధానం ప్రతీ ఒక్కరూ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డా. సీ హెచ్ తేజ, హెడ్ నర్స్ బి. బొజ్జి, యూ డీ సీ శ్రీనివాస్ రెడ్డి, స్టాఫ్ నర్సులు పలీనా, అనసూర్య, తులసి, దేవి ప్రసన్న, నగేష్, జోగారావు, సతీష్, తేజ, బాపిరాజు, అఖిల్, వెంకన్న, దిలీప్ కుమార్, శ్రావని, మరియమ్మ, భువన, రమాదేవి, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి ఆశ్రమంలో బి.ఎన్.బి.రావు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పట్టణ శివారున నవిరి కాలనీ వద్ద గల ఆశాజ్యోతి అనాధాశ్రమంలో ఎల్ఐసి అసోసియేట్, ఆశాజ్యోతి ఆశ్రమం చీఫ్ ఎడ్వైజర్, పాస్ట్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, ఇండియన్ రెడ్ హౌస్ సెక్రటరీ బడే నాగభూషంరావు (బి.ఎన్.బి రావు) జన్మదిన వేడుకలను ఆశ్రమంలో గల అనాధపిల్లలు, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ జల్లు వినయ్ కుమార్ మాట్లాడుతూ ఆశాజ్యోతి అనాధాశ్రమానికి బి.ఎన్.బి రావు సేవలు వెలకట్టలేనివని అనునిత్యం ఆశ్రమానికి అండదండగా వుంటున్నారని తెలిపారు. ఆశ్రమ జాయింట్ సెక్రటరీ పెంటపాటి సాయికిరణ్ మాట్లాడుతూ శ్రీ బి.ఎన్.బి రావు గొప్ప సంఘ సేవకులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా.మంచిపల్లి శ్రీరాములు, కమిటీ సభ్యులు బొమ్మన పార్వతీశం, చెరుకూరు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనాథపిల్లలకు అన్నదాన కార్యక్రమం జరిగినది. బి.ఎన్.బి రావు టీం ఎల్ఐసి ఏజెంట్స్ కూడా ఎల్ఐసి ఆఫీసులో కూడా ప్రత్యేకంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లోని పాఠశాలలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు 2025 డిఎస్సీ ద్వారా భర్తీ చేయబడినవి, మండలంలో జిల్లా పరిషత్ మరియు మండల పరిషత్ లో ఇప్పటివరకు మొత్తం 29 ఖాళీలు ఉండగా సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు 21, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 02, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 3 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు 2, మొత్తం 29 పోస్టులకు గాను 21 మంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విధులలో చేరడం జరిగింది, అదేవిధంగా గిరిజన సంక్షేమ పాఠశాలలో సెకండ్ డిగ్రీ ఉపాధ్యాయులు 10, స్కూల్ అసిస్టెంట్ 01, పిజిటి ఉపాధ్యాయులు 2, టిజిటి ఉపాధ్యాయులు 5, పిడి 1 మొత్తం 20 మంది ఉపాధ్యాయులు విధులలో చేరి ఉన్నారు. ఈ డీఎస్సీతో మండలంలో అన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీరింది దీనితో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందంగా వ్యక్తపరుస్తున్నారు.

శక్తి టీలం అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది సోమవారం పార్వతీపురం చర్చి వీధిలో గాక డివిఎం స్కూల్, బెలగాం గిరిజన ఆశ్రమ పాఠశాల, దత్తుపేట ఎంఈఈ స్కూల్, కట్ట సరస్వతమ్మ ఎంఈఈ స్కూల్, పార్వతీపురం పట్టణ పరిధిలో ఉన్న విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతి ఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్ పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం 1 ఇంచార్జ్ మరియు ఏఎస్ఐ లెంక శ్రీనివాసరావు (1154), హెచ్సీ గురుమూర్తి, శక్తి టీం 1 పాల్గొన్నారు.

ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం గిరిజనులకు వరం

బలపం సర్పంచ్ రమేష్‌నాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా రూపొందించి అమలుకురుస్తున్న ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం గిరిజనులకు వరమని బలపం సర్పంచ్ కె రమేష్ నాయుడు అన్నారు. ఆ పంచాయతీ కార్యదర్శి దిలీప్ కుమారి ఆధ్వర్యంలో పంచాయతీలోని జోహార్, దిగువ వలసపల్లి, వేలంజువ్వి తదితర గ్రామాలలో సోమవారం నిర్వహించిన ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజనులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకై యాక్షన్ ప్లాన్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజనులకు అందబోతున్న అన్ని అవకాశాలన సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ వార్డ్ సభ్యురాలు జానకమ్మ, గ్రామస్తులు మోహన్, చిట్టిబాబు, కూటమి నాయకులు నారాయణరావు, పేసా కమిటీ నాయకులు రంగారావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా పత్రాలు కలిగే ఉండాలి : ఎస్సై వెంకటరమణ

విశాలాంధ్ర-చింతపల్లి: లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన పత్రాలు, పరిమితికి మించిన వేగాన్ని ప్రదర్శిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై వెంకటరమణ అన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగా స్థానిక ఏఎస్‌పి నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు సూచనలతో సోమవారం స్థానిక హనుమాన్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులు లైసెన్సులను, వాహనాలకు సంబంధించిన ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అదే క్రమంలో వాహనాలను నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను పరిమితికి మించి వేగంగా నడపరాదన్నారు. వేగంగా నడపడం వలన అదుపుతప్పి ప్రమాదాలు సంభవించే అవకాశం లేకపోలేదన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోయినా, అతివేగాన్ని ప్రదర్శించినా, అదేవిధంగా త్రిబుల్ రైడింగ్ చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భగవాన్ బిర్సాముండా సమాధిని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నా

భారత ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : భగవాన్ బిర్సాముండా సమాధిని సందర్శించిడం అదృష్టంగా భావిస్తున్నానని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రం రాంఛీలో జరిగిన జాతీయ ఆదివాసీ సమావేశానికి హాజరై, స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సాముండాను బ్రిటిష్ ప్రభుత్వం 1900 సంవత్సరంలో బంధించిన జైలు (అదే జైలులో చనిపోయారు)ను దేశ స్వాతంత్ర్యం అనంతరం మ్యూజియంగా మార్చడం జరిగిందని, బిర్సాముండా చనిపోయిన జైలు గదిని సందర్శించి,మ్యూజియంలో గల ఆయన విగ్రహాన్ని, మిగతా ఆదివాసీ యోధుల విగ్రహాలను సందర్శించి అక్కడి నుండి బిర్సాముండా సమాధి వద్దకు చేరుకుని ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. బిర్సాముండా చనిపోయిన జైలును, ఆయన సమాధిని సందర్శించి ముండాజీకి ఘనంగా నివాళులు అర్పించడం జీవితంలో మర్చిపోలేని క్షణమని, అలాంటి మహా వీరుల త్యాగాల ఫలితమే నేడు ఆదివాసీలు అనుభవిస్తున్న రిజర్వేషన్లు, హక్కులు, చట్టాలని రాజబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి ఉమ్మల దుర్గారెడ్డి, రాజస్థాన్ ఆదివాసీ ప్రతినిధి అవిదేష్ గమేటి తదితరులు పాల్గొన్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సీఎఫ్ఎల్ అవగాహనా సదస్సు ద్వారా గిరిజనులకు లబ్ధి

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం గోందివాడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సులో అవగాహనా కార్యక్రమం ఒక గిరిజనుడికి లబ్ధిచేకూరడం పలువురికి సంతృప్తి నిచ్చింది. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అవగాహనా సదస్సులు నిర్వహించటం ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలలో బ్యాంకింగ్ పథకాలపై సామజిక భద్రత పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్, ప్రైవేట్ ఆర్థిక సంస్థల మోసలపై ఆన్లైన్ బ్యాంకింగ్ లావాదేవీలా మోసాలపై విస్తృత అవగాహన కల్పించటంతో నిరాక్షారస్యత గల గిరిజనులు అనేక విషయాలు తెలుసుకొని మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడుతున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలియపర్చటం జరిగింది. ఇదే కార్యక్రమంలో పలు రకాల జీవిత భీమాకు సంబంధించి అటల్ పెన్సన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పియం ఎస్‌బివై, పియంజెజెబివై వంటి కేంద్ర పాలసీలు అవగాహనా చర్చించటంలో గోందివాడ గ్రామానికి చెందిన సూంట్రూ రామిరెడ్డి తల్లి 2020 నా అనారోగ్యంతో చనిపోయిన తన తల్లి సుంట్రూ రామాయమ్మ ఖాతాలో డబ్బులు ఉన్నట్టు ఎలా తీసుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నట్టు తెలియ జేయ్యటంతో వెంటనే ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సంబంధిత బ్యాంకు అధికారులు తో పరిశీలన చేయించగా ఆమె ఖాతాలో 35000 రూపాయలు ఉన్నట్టు బ్యాంకు అధికారులు తెలపటం జరిగింది. ఈ క్రమంలో ఆర్థిక అక్షరాష్యత కేంద్రం సీఎఫ్ఎల్ చొరవతో తల్లికి నామినిగా వున్నా సూంట్రూ రామిరెడ్డి ఖాతాలో 35000 వేల రూపాయలు కేవలం వారం రోజుల గడువులో రామిరెడ్డి ఖాతాలో జమా చేయటంతో ఎనలేని అనందం వ్యక్తం చేసారు.ఇప్పటికి అనేకమంది లోతట్టు ప్రాంత ప్రజలకి ఆర్థిక లావాదేవీలా పై అవగాహనా కొరత ఎక్కువ ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సి ఎఫ్ ఎల్ కౌన్సిలింగ్ సభ్యులు రాజమాన్యం,బి. సాయి,ఎల్. ప్రదీప్ కుమార్ మరియు మారేడుమిల్లి యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా బ్యాంకు మేనేజర్ హర్ష వర్ధన్ పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టిపై అందరికి అవగాహన అవసరం

- అన్నివర్గాలకు ప్రయోజనకరం సూపర్ జిఎస్‌టి 2.0
- సహాయ కార్మిక కమిషనర్ సువర్ణ

విశాలాంధ్ర-బెలగాం : సూపర్ జిఎస్‌టిపై అందరికి అవగాహన అవసరమని, అన్ని వర్గాలకు ప్రయోజనకరం సూపర్ జిఎస్‌టి 2.0 అని కార్మిక శాఖ సహాయ కమిషనర్, పి. సువర్ణ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జి.ఎస్.టి 2.0 పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు గిగ్ (తాత్కాలిక పనివారు) ప్లాట్ఫాం వర్కర్లతో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో ఇతర మండలాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సువర్ణ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రయోజనం కల్గించే విధంగా జిఎస్‌టిని నాలుగు శ్లాబుల నుంచి రెండే శ్లాబులకు పరిమితం చేయడం జరిగిందని, సామాన్యులు ఉపయోగించే 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబు పరిధిలోకి చేర్చారని, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలను 18శాతం పరిధిలోకి తెచ్చారని, ఆరోగ్య భీమాపై పన్నును పూర్తిగా తొలగించారని తెలిపారు. దీనివల్ల సామాన్య ప్రజలకు అవసరమైన ముఖ్యమైన వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని వివరించారు. ఈ ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ పేరుతో నెలరోజులపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా జిల్లాలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిఎస్టి తగ్గింపు వల్ల సామాన్యులపై భారాలు తగ్గుతాయని, ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు రావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ సహాయ డైరెక్టర్ పి.సీతారాం, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, జి. శ్రీనివాసరాజు పార్వతీపురంలోని పలువురు వ్యాపారులు, ప్రజలు ఉన్నారు.

విధులలో చేరిన నూతన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర -జియ్యమ్మవలస : మండలంలో సోమవారం కొత్తగా కొత్తగా ఉపాధ్యాయులు విధులలో చేరారు మండల విద్యాశాఖధికారులు ఇచ్చిన వివరాల మేరకు పిప్పల భద్ర ,బీజేపురం పెద మేరంగి పెదబుడ్డిడీ, చిన మేరంగి చినకుదమ జియ్యమ్మ వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా ఇద్దరు తెలుగు, ఇంగ్లీష్ ఒక స్కూల్ అసిస్టెంట్ వీటిలో ఐదుగురు ఎస్జీటీలు ఏడుగురు స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఒక స్కూల్ అసిస్టెంట్ ఎస్ ఎస్ ఫిజికల్ డైరెక్టర్లు ఒక స్కూల్ అసిస్టెంట్ పి ఎస్, లు కలిపి మొత్తం 21 మంది విధులలో చేరారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ ఆశ్రద ఉన్నత పాఠశాలలో నాలుగు ఒక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉండగా ఎ జి టీలు 16 మంది ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఎస్ఎస్ ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ పిఎస్ లు కలిపి మొత్తం 20 మంది విధులలో చేరారు. వీరంతా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తమ జాయినింగ్ రిపోర్టులను అందజేశారు.

మోతుగూడెం : అల్లూరి జిల్లా, చింతూరు

మండలం, మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025 డీఎస్సీ ఫలితాల్లో ఎన్నికైన ముగ్గురు ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇందులో దార కిరణ్‌కుమార్, దానె ప్రసాద్, తెనాలి హిమబిందు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సొమ్మన్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో టీచర్స్ ఉన్నందున చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజవొమ్మంగి : 2025 మెగా డిఎస్సిలో

భాగంగా రాజవొమ్మంగి మండలానికి 17 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నట్లు ఎంఇఓ కారం వీర వెంకట సత్యనారాయణ తెలిపారు,వీరు సోమవారం ఎంఇఓ చేతులమీదుగా అపాయింట్ మెంట్ పత్రాలను అందుకున్నారు,వీరిలో 6గురు స్కూల్ అసిస్టెంట్స్,9మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్,ఇద్దరు పిడీలు ఉన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర-మోతుగూడెం : అల్లూరి జిల్లా,చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలోగల ఫోర్ బై గ్రామంలో కనకదుర్గమ్మ గుడి కమిటీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించారు. విజయదశమి మహోత్సవంలో భాగంగా ప్రతి ఏడాది నిర్వహించే భారీ అన్న సమారాధన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ అన్న సమరాధన కార్యక్రమంలో పోరబై, పోల్లూరు, మోతుగూడెం మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

జీఎస్టీ 2.0తో ప్రతి ఒక్కరికీ ఉపయోగకరం

విశాలాంధ్ర-అరకులోయ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జిఎస్టి 2.0తో ప్రతి ఒక్కరికి ఎంతో మేలు జరుగుతుందని అరకు లోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన జిఎస్టి 2.0 పై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. జిఎస్టి 2.0 గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.జిఎస్టి జిఎస్టి వలన ఏఏ వస్తువులు తగ్గుతున్నాయో ఎటువంటి వస్తువులు కొనుగోలు చేస్తే లాభదాయకంగా ఉంటుందో అందరూ తెలుసుకోవాలని, తెలుసుకున్న విషయాలను ఇతరులకు తెలియజేస్తూ వారిని కూడా చైతన్య పరచవలసిన అవశ్యకత ఉందని ఆయన తెలియజేశారు. స్వదేశీ ఉద్యమంలో పాల్గొని, స్వదేశీ వస్తువులను కొనుగోలు చేస్తూ, విదేశీ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన తెలుపునిచ్చారు. ఇంట్లో ఉన్న విద్యార్థి ప్రతి ఇంట్లో ఉన్న విద్యార్థి కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు జిఎస్టి 2.0పై అవగాహన కల్పిస్తే కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత జిఎస్టి వలన ఎక్కువగా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, గృహ నిర్మాణ సామాగ్రి ఇంకా అనేక వస్తువుల ధరలు భారీగా తగ్గాయని ఈ విషయాలు తెలుసుకోకపోతే అవగాహన చెందకపోతే వ్యాపారులు మోసం చేసే అవకాశము ఉందని ఆయన అన్నారు. దీని దృష్టిలో పెట్టుకొని జిఎస్టిపై అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశి కుమార్, అధ్యాపకులు బాలరాజు, సంధ్య, అన్నపూర్ణ, సిబ్బంది విద్యార్థినులు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు జెన్కో ఎస్ఈ సివిల్, ఈఈ ఆపరేషన్, మెయింట్ నెన్స్ వారికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌హెచ్-176 (సీఐటీయూ)/ అప్పర్ సీలేరు బ్రాంచ్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. 2017వ సంవత్సరంలో తెలంగాణ విద్యుత్ సంస్థలు వారి కాంట్రాక్ట్ కార్మికులను ఏ విధంగా విలీనం చేసి, వారి సర్వీసులను క్రమబద్ధీకరించారో ఆ తరహాలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖలో(ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్కో, డిస్కమ్స్‌లలో) పనిచేస్తున్న సుమారు 27,151 మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి పర్మినెంట్ చేయవలసిందిగా కోరారు. అలాగే అక్టోబర్ 14 తేదీలోపు సానుకూల పరిస్థితులు నెలకొని ఉంటే సరేసరి లేని పక్షంలో అక్టోబర్ 15 వ తారీఖు ఉదయం 6 గంటల నుండి సమ్మె అనివార్యమని వారు తెలిపారు. తద్వారా 15వ తారీఖు నుండి రాష్ట్రం అంధకారమేనని సూచనప్రాయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పర్ సీలేరు బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్, కార్యదర్శి టి.విష్ణుకుమార్, అలాగే జెన్కో ట్రాన్స్ కో విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

డోలిమోతలు లేని గ్రామాలే ఉండాలి : కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో డోలి మోతలు లేని గ్రామాలే ఉండాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర రెడ్డి తెలిపారు. ప్రతీ గ్రామానికి అంబులెన్స్ వెళ్లే విధంగా తీర్చి దిద్దడానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. జలపాతాల ఖిల్లాగా పార్వతీపురంను మార్చాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలపరిధిలో పర్యాటక ప్రాంతాలను గుర్తించాలని, వాటికి సంబంధించిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పర్యాటకుల కొరకు ప్రతి చిన్న జలపాతాల్ని గుర్తించి, అందరికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లాని జలపాతాల ఖిల్లాగా మారాలని ఆశభావం వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డోలి మోతలు లేని గ్రామాలే ఉండాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించాలని అన్నారు. ప్రతీ గ్రామానికి అంబులెన్స్ వెళ్లే విధంగా తీర్చి దిద్దడానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులన్నీ సకాలంలో పరిష్కారం కావాలని, అర్జీదారు దాంతో అర్జీదారుడు సంతృప్తి చెందాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీ రీఓపెన్ కారాదని, ఫిర్యాదు నమోదు సమయంలో అధికారి భాష మరియు సంభాషణా శైలి సక్రమంగా, మర్యాదగా ఉండాలని సూచించారు. అర్జీదారు సమస్యను సావధానంగా వినాలని, ఓపికగా రెండు, మూడు నిమిషాలు కేటాయించి మర్యాదగా నడుచుకోవాలని హితవు పలికారు. ఫిర్యాదుదారుని సంతృప్తి పరచేలా మాట్లాడాలని చెప్పారు. ఈపిటిఎస్ అప్లోడ్ వేగవంతం చేయాలని, గత వారం కంటే ఈ వారం అప్ లోడ్‌లో పురోగతి ఉందన్నారు. కౌశలం సర్వే వేగవంతం చేయాలని, తరచూ విసి, టిసిలు నిర్వహించడంతో పాటు వారానికి ఒకసారి ఫిజికల్ మీటింగ్ నిర్వహించి, మంచి పనితనం కనబరచాలన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల పరిష్కారంతో సంతోషంగా ఇంటికి వెళ్లాలని అన్నారు. రెవిన్యూ సమస్యల సత్వర పరిష్కారం కొరకు ప్రత్యేకంగా క్లినిక్ ప్రారంభించిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యధోరణి పనికిరాదని అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగగా, కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టరులు ఆర్.వైశాలి, పవార్ స్వప్నల్ జగన్నాథ్, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డిలు వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన 112 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు,రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, గృహాల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితర సమస్యలకు పరిష్కారాన్ని కోరుతూ కలెక్టరుకు తమ అర్జీలను అందించారు. అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అక్టోబర్ 13, 14 తేదీల్లో జరిగిన సమీక్షా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు ఈనెల 15న ధర్నా నిర్వహిస్తున్నట్లు వీఆర్ఏల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం సోమవారం సమర్పించారు. వీఆర్.ఏ.ల సేవలకు గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలని, పదవీ విరమణ నాటికి తగిన పరిహారం అందించాలని ప్రస్తుతానికి రాష్ట్రంలో 19,359 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. వీరికీ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వైద్య సదుపాయాలు, బీమా, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 2018లో వీఆర్.ఏ.లకు రూ.6,500 వేతనం ఉండగా, ప్రస్తుతం రూ.10,500 మాత్రమే అందుతున్నదని, జీవన వ్యయం పెరగడంతో ఆ వేతనం సరిపోవడంలేదని తెలిపారు. సమావేశంలో మాట్లాడిన నేతలు, వీఆర్.ఏ.ల వేతనాలను కనీసం రూ.16,000కి పెంచాలని, అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, గ్రామ రెవెన్యూ సహాయ సేవకులకు పేస్కేలు అమలుచేయాలని, అక్రమ నైట్ డ్యూటీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్లక్ష్య ధోరణి కొనసాగితే సమ్మెలు, ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. పొట్టియ్య, ప్రసాద్, సీతారాములు, రవిబాబు, చుంచు రవి, బుయ్యన శ్రీను, పెడపెట్ల శేఖర్, చీమల సాయమ్మ, గంగమ్మ, పోసి బాబు పాల్గొన్నారు.

ఆర్.టి.సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ఆర్.టి.సి బస్ స్టాండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజూ పరిశీలన చేయాలని ఆర్.టి.సి అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమం చేపట్టక ముందు తరువాత ఫోటోలు తీయాలని, బస్సు షెల్టర్లను పరిశుభ్రంగా ఉంచాలని, బస్సు స్టాప్ లు, బస్సు షెల్టర్లు, బస్సు స్టాండ్లు అన్ని ఫోటోలు తీయించాలని చెప్పారు. బస్సులో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అమృత్ పథకం కింద బస్సు స్టాండ్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. దివ్యాంగులకు, వృద్ధులకు బస్సు ఎక్కించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు బాగా జరగాలని ప్రతి ట్యాంక్ అభివృద్ధి, మొక్కలు నాటడం ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లాలో చాలా వరకు 100 శాతం ట్యాంకులతో, మరికొన్ని నింపేలా చర్యలు చేపట్టాలని, ప్రతీ వీధిలో యూత్ ని సేకరించి వారితో చేయించలన్నారు. తానుకూడా ఆకార్యక్రమంలో పాల్గొంటానని చెప్పారు. జిల్లా అంతటా పరిశుభ్ర వాతావరణం కనిపించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ శాఖలపై వచ్చిన ప్రతికూల వార్తల పట్ల తక్షణమే స్పందించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. వార్తల్లో వాస్తవాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వార్తలపై సకాలంలో స్పందించకుంటే ఒక్కోసారి ప్రజలకు నష్టం వాటిల్లవచ్చని, అలాగే కొన్నిసార్లు తప్పుగా సమాచారం వెళ్ళవచ్చని అన్నారు. కావున అధికారులు వార్తల పట్ల క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఖండన ఇచ్చే సమయంలో వార్తకు అనుగుణంగా మాత్రమే సమాధానం ఉండాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లా అధికారులు వారి స్థాయిలో చేపట్టవలసిన పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో 100% ఉద్యోగ రిజర్వేషన్ కోసం కదం తొక్కిన ఆదివాసీ ప్రజానీకం

విశాలాంధ్ర-చింతూరు : ఆదివాసి నిరుద్యోగ సంఘం, ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆదివాసి, గిరిజన సంఘాలు మరియు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ఐక్యతతోతల పెట్టిన హలో ఆదివాసి చలో చింతూరు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆదివాసి నిరుద్యోగ సంఘం సభ్యులు పాయం వెంకటేష్, గొర్రె మీనా అధ్యక్షత వహించగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పాచిపెంట అప్పల నర్స గారు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీని పెడచెవిన పెట్టి ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, రాజ్యాంగం ప్రకారం 5వ షెడ్యూల్ ప్రాంతం ఆదివాసీల కోసం ఏర్పాటు చేయబడిందని ఇటువంటి ప్రాంతంలో కూడా ఆదివాసి అభివృద్ధికి తోడ్పడే జీవో నెంబర్ 3 రద్దుచేసి ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశాయని మండిపడ్డారు. ఐదవ షెడ్యూల్ ఏరియాలో గవర్నర్ కి మరియు రాష్ట్రపతికి విచక్షణమైనటువంటి అధికారాలు ఉన్నాయని టి ఏ సి తీర్మానం చేసే గవర్నర్ మరియు రాష్ట్రపతి రెగ్యులేటర్ ఆర్డర్స్ ద్వారా ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ సాధ్యమే అని కానీ ప్రభుత్వాలు ఆరకమైనటువంటి ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మడివి నెహ్రూ, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు కుంజ శ్రీనులు మాట్లాడుతూ ఆదివాసి ఓట్లతో గెలిచినటువంటి ఎమ్మెల్యేలు ఏజెన్సీ ప్రాంతం లో ఆదివాసీలకు 100% రిజర్వేషన్ కోసం మాట్లాడుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఆదివాసి ప్రజానీకాన్ని ఏకం చేసి భవిష్యత్తు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సీసం సురేష్ పూనం ప్రదీప్ కారం నాగేష్ డివిజన్ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్, కుంజా అనిల్, ఆదివాసి లాయర్ మడివి రవితేజ , కొండరెడ్ల సంఘం నాయకులు, ముళ్ళ కనకా రెడ్డి, నాయకపోడు సంఘం నాయకులు, చిక్కాల బాలకృష్ణ, విఆర్ పురం ఎంపీపీ, కారం లక్ష్మి, కూనవరం జడ్పిటిసి గుజ్జ విజయ తుమ్మల ఎంపీటీసీ వేక రాజ్ కుమార్ ఏజ్ కోడేరు సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి నిరుద్యోగ సంఘం నాయకులు ఇ చిచ్చడి రాము, పాయం రతన్, మోసం రాంబాబు, కూర చిట్టి బాబు, సలం వెంకటేష్, పోడియం శ్యామల, పూనం ప్రవీణ, బీరబోయిన గౌతమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.